స్కెచ్

# చెడిపోయాడుట

పోలవరపు శ్రీహరిరావు

రామూ చెడిపోయాట్ట. మేం యిద్దరమూ కలిసే చదువుకున్నాం, యిప్పటికీ ఒకే గదిలో వుంటున్నాం; నాకు తెలియనే తెలియదు - రామూ చెడిపోయాడని. ఇప్పుడు రామూతో సన్నిహిత సంబంధం లేని వాళ్ళందరికీ-రామూ చెడిపోయాడనే సంగతి ఎలా అర్థమయిందో నాకు తోచడంలేదు. మమైకంగా మెలగుతున్న నాకు తెలియకుండానే రామూ చెడిపోయాట్ట!

ప్రొద్దున్నే లేచి వీధి అరుగుమీద కూర్చుని ముఖం కడుక్కుంటూండగా యీ దుర్వార్త నాచెవిని పడింది. మల్లయ్యా, పుల్లయ్యా వీధి వెంట నడుస్తూ నావైపు చూశారు. వాళ్ల చూపుల్ని పరీక్షించే అవసరం కలగలేదు. కాని నన్ను దాటగానే మల్లయ్య కాండ్రించి వుమ్మివేసి "ఛీ...పాడు సావాసాలు. ఇట్లాంటి సావాసాల వల్లనే నరుకో, పంతంటివాళ్లు చెడిపోయేది!" అనడంతో-నే నటు చూశాను. పుల్లయ్య "రామూ నేస్తుడీ కుర్రాడేనా ఏమిటీ?" అని అడిగాడు. ఇదేదో నామీద విరుచుకుపడుతూందనే ఆందోళన భయాలతో వాళ్లమాటలు విన్నాను.

మల్లయ్య "ఆకుర్రాడూ రామూ నేస్తుడే. ఇద్దరూ ఒక్కంచాన తిని, ఓమంచాన పండేవారు...అయితేనేం? ఒకరిగుణా లొకరి కబ్బుతాయా? ఇతను శుభ్రంగా ఏదో నౌకరీ చేసుకుంటూంటే-వాడు ఆ పికిలి తిప్పకాయల సావాసంజేసి యిట్టా చెడిపోయాడు" అన్నాడు సాగదీస్తూ. వాళ్లు వీధిమూల తిరిగేవరకూ వాళ్ల మాటలు చెవుల్లో తిరుగుతూనే వున్నాయి.

ఇంతకూ రామూ నాతోగాక, మరెవరి స్నేహంవల్ల ఎలా చెడిపోయాడో నాకు తెలిసిందిగాదు. కాని యీ మల్లయ్యల మాటలు పైకి ఎంత సత్యాలుగా కనిపించుతాయో, లోపల అంత విచిత్ర వ్యతిరేక భావాలను కలిగి వుంటాయి అని తెలిసింది. స్నేహితాన్నిగురించి మల్లయ్యగారిచ్చిన పై అభిప్రాయాలు పరికించండి. ఒకరిగుణా లొకరి కబ్బుతాయా అనీ అన్నాడు, చెడు సావాసాలవల్ల చెడిపోయాడనీ అన్నాడు. అసలు సంగతిరాముడు చెడిపోయాట్ట!

నాకు తెలియని చెడునడవడి రామూలో వున్నదని నా కేకోశానా నమ్మకంలేదు. నిప్పు లేకుండా పొగరాదన్నట్లు - అసలేమీ లేకుండానే చెడిపోయాడని అంటారా? ఏమో! ఏదీ నిశ్చయించుకో లేకుండానే ముఖం కడుక్కుని, చెంబు యింటిలో పెట్టి కాఫీ దేవాలయానికి నడుస్తున్నాను. ఎదురుగా కామయ్యగారు దొర్లుకొచ్చారు. ఆయన వలయాకారం నడుస్తూంటే గుమ్మడికాయ దొర్లుతున్నట్లే వుంటుంది. అందుకనే ఆయనిది నడకగాదు-దొర్లుడే.

కామయ్యగారు దొర్లు డాపి, పన్నుగ్రమీద ఆని నిల్చుని నా కళ్లల్లోకి చూస్తూ నవ్వారు: ఓటికుండతో మాట్లాడినట్లు నవ్వు! సామాన్యపు నౌకరీ చేసుకుంటున్న నాముందు ఆ షావుకారు నిల్చుని అట్లా నవ్వుతూంటే—నాకు 'జూ' లో మృగం ఎదిరించినప్పుడు కలిగే ఆందోళన కలిగింది. పైగా కామయ్య కోరమీసాలను విలాసంగా దువ్వుకుంటూ సకిలించాడు. ఆ వాలకం చూస్తే పోట్లాటకి కాలుదువ్వే పొట్టేలు గుర్తుకొచ్చింది. వీడి కెంత అహంకారమూ అనే అసహ్యంతో, ఆ వలయాన్ని తప్పుకుని వెళ్ళిపోబోయాను.

కామయ్య నాజబ్బను గట్టిగా పట్టుకున్నాడు. అతరి ఎలుగ్గొడ్డుపట్టు నా జబ్బను బాధించడమే కాక, నాకు మాచెడ్డ అసహ్యం వేసింది. ఎంత షావుకారయితే మాత్రం-యీ కామయ్యగాడు నా చెయి పట్టుకుని నన్నాపే అధికారం ఎట్లా సంపాదించాడూ? పురుగును విదిలించినట్లు చెయ్యి గుంజుకున్నాను గాని అతని చెయ్యి సడల్లేదు. తీవ్రంగా కామయ్య ముఖంలోకి చూశాను. వాడి కళ్ళలో వెకిలి-చికిలింతలు మెరుస్తున్నాయ్.

ఫక్కున నవ్వి 'అయిందోయ్ పెళ్ళి, అణిగిందోయ్ రంధి' అన్నాడు. వీడి అసందర్భ ప్రలాపాలేమిటా అని చికాకువేసింది. నేను నా చెయ్యి గుంజుకుని కూడా విదిలించుకో లేక పోయాననేగా వీడి ఎకతాళి! ఇంతవరకూ ఎరుగున్న పెద్దమనిషి కదా అని వూరుకున్నాను గాని లేకపోతే నా ఒంటిమీద వాడిగాలినైనా సోకనిచ్చేవాణ్ణా? ఇక వీడి పెద్దమనిషితనాన్ని మంటగలపాలి.

“ఏమిటయ్యా యిది?” అన్నాను కరుగ్గా. కామయ్య గట్టర్‌లోనుంచి వచ్చే ప్రవాహంలా నవ్వుతూ, నన్ను అటూ యిటూ కుదిపేశాడు. నా కది చెంచులవాళ్ళ కంచుతాళానికి ఎలుగుబంటి నృత్యం చేసినట్లుంది. కొంతసేపటికి పొంగుకొచ్చే నవ్వును మింగుతూ “అయిందిగా- కావలసినంతా! వీళ్ళబడాయి యెంతసేపోయ్? చెప్పినంతా చేశామా? మాతో పని అంతే, అంతే” అన్నాడు-తాగిన స్టేజినటకుడిలా. మీసం ఒడివేసుకుంటూ నన్నేదో చెప్పమన్నట్టు చూస్తున్నాడు.

నా కాతని మాటల సందర్భా సందర్భాలు బొత్తిగా అర్థం కాలేదు. కాని, అతనిమీది అసహ్యంతో పాటు—విషయ మేమిటో తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది. “అసలు విషయం ఏమిటండీ?” అన్నాను. అతగాడి నవ్వు అణగిపోయింది. దాని స్థానంలో ఆశ్చర్యం పొడుచుకొంది. “నీకు తెలియనే తెలియదా ఏమిటి?... రామూ - మీ రామూ అయ్యా” అని మళ్ళీ నవ్వు మొదలెట్టాడు. “ఏం? మా రామూ కేమయింది?” అని సీరియస్‌గా అడిగాను.

“అయిందయింది... ఈ సంబరం, యీ కుప్పిగంతులూ మా ముందా? హాఁ... ఇదుగో, నువ్వు కాస్త బతుకుదెరువు తెలిసినవాడివి కదా- మీ మిత్రుడికి బుద్ధి చెప్పకూడదూ? ... వేసిందే ఒక గంతు, విరిగిందే ఒక కాలు! ... ఇంతకూ మాతో పని—మాటలా? అహ్హహ్హా!” అన్నాడు. అప్పటికి నా కర్థమయింది కాదు. మొత్తంమీద రామూకు యీ కామయ్య యేదో కీడు కలిగించాడనే అనుమానం కలిగింది. ఐతే రామూ చేసిన దుండగం ఏమిటో నాకు తెలిసింది కాదు.

“రామూకేం ముప్పుముంచుకొచ్చిందేమిటి?” అన్నాను. సాధ్యం కాని వ్యంగ్యాన్ని సాధ్యం చేసుకుంటూ, కామయ్య “అన్నట్లు నీకు తెలియక తెలియదూ?... ఒక్క గదిలో, ఒక్కయిదిగా వుంటున్నారు కదా! చెడుపనుల్లో వేలుపెట్టొద్దని నువ్వు చెప్పనే లేదూ?... అటువెళ్ళి పోలీస్ స్టేషన్‌లో చూడవయ్యా, పిచ్చివాడా... చూచిరా” అంటూ నవ్వాడు. “రామూ పోలీసు స్టేషన్‌లో ఎందుకున్నాడు? అత నేం తప్పు చేశాడూ?” అని నే నడిగాను.

కామయ్య “ఇంకేం చెయ్యాలి? మాలగూడెంలో వాళ్ళందరికీ చదువంటూ ఒకవేషం వేశాడు. అది చదువు చెప్పడమూ గాదు, చట్టుబండలూ కాదు—‘పాలేరు’ అంటే రైతులో భాగస్థుడనీ; అతనికి కనీసం రెండుపుట్ల జీతమూ, రెండుజతల బట్టలూ, చెప్పులూ వగైరా యిస్తేనే రైతుకు జయమనీ; అలా యివ్వని రైతు కెవరూ పాలేళ్ళుగా వుండరాదనీ; మా గనుల్లో పనిచేసే వాళ్ళను రోజు కూలిగాక, వాళ్ళుతవ్వేదాన్ని బట్టి కూలి నిర్ణయించాలనీ; అలా కూలిగాక ఏదో యిన్సూరెన్సు చెయ్యాలనీ, హాస్పిటల్ వుండాలని... ఏమేమో చెప్పి నేర్పాడా బడుద్ధాయిలకు. వాళ్ళా సౌకర్యాలన్నీ చూపిస్తేనే కూలికొస్తామని మొరాయించారు. అంతే ...” అంటూనే వెళ్ళసాగాడు. నేనో క్షణంలోనే జరిగిన సంగతులు అర్థం చేసుకున్నాను. దూరాన కామయ్య “వెళ్ళిచూసుకో మళ్ళా ఏ ఆరునెల్లకో దర్శనం” అంటూ వికటంగా నవ్వుతూ మలుపు తిరిగాడు.

నేను వాడి వ్యంగ్యానికి చాలా చిరాకు పడ్డాను. అయినా ఆ కామయ్య నేం చేసి కసి తీర్చుకోగలను?... ముందుకు నడిచాను. కాఫీ హోటల్లో అయ్యరిచ్చిన కషాయం తాగుతూ రామూను గురించే ఆలోచిస్తున్నాను. నా బల్ల పక్క కూర్చున్న సూట్‌వాలాలు—“చెడిపోతావురా బ్రదర్ అంటే విన్నాడా వాడు... అబ్బే! చెడిపోయే వాడెందుకు వింటాడు! ఇక నయింది మనలాగా ఆ కామయ్యను నమ్ముకుంటే ఒకింటి వాడయేవాడా!”... లక్ష కామెంట్లు విసిరారు. చివరికి రామూ పూర్తిగా చెడిపోయాడనే నిర్ణయించారు.